క్లుప్తంగా

మూల పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గడివేముల:కొలిచే వారికి కొంగుబంగారమై విరాజిల్లుతున్న గడివేముల మూలపెద్దమ్మ ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ తదితర విశేషపూజలు చేసి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

బాధ్యతలు స్వీకరించిన పీఆర్ఐ డీఈఈ



డీఈఈకి అభినందనలు తెలుపుతున్న సచివాలయ ఇంజనీరింగ్ సిబ్బంది

కోడుమూరు రూరల్: కోడుమూరు పంచాయతీ రాజ్ డీఈఈగా కర్రెన్న మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న మహేశ్వరరెడ్డి కర్నూలు ప్రాజెక్టు ఇంప్లిమెంటింగ్ యూనిట్ డీఈఈగా బదిలీపై వెళ్లారు. దీంతో కర్నూలు సర్వశిక్ష అభియాన్‌లో డీఈఈగా పనిచేస్తున్న కర్రెన్నను ఇక్కడ జిల్లా అధికారులు నియమించారు. డీఈఈ బాధ్యతలు స్వీకరించిన కర్రెన్నను కోడుమూరు ఏఈ గంగరాజు, గ్రామ సచివాలయాల ఇంజినీరింగ్ సిబ్బంది కలిసి పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

ఎంపీడీఓ రాముడు బదిలీ

సి.బెళగల్: ఎంపీడీఓ రాముడు కోడుమూరు మండలానికి బదిలీ అయ్యారు. ఇక్కడికి ఆస్పరి మండల ఎంపీడీఓ రాణెమ్మను నియమిస్తూ జిల్లా అధికారులు ఉత్వర్వులను జారీ చేశారు.

వెలుగు ఏపీఎంగా రామేశ్వర్

వెలుగు ఏపీఎంగా రామేశ్వరు నియామకం అయ్యారు. దేవనకొండ మండలంలో ఏపీఎంగా పనిచేస్తున్న రామేశ్వర్‌ను ఉన్నతాధికారులు ఇక్కడికి బదిలీ చేశారు. అదేవిధంగా ఇక్కడ వెలుగు ఏపీఎంగా పనిచేస్తున్న వెంకటస్వామిని కర్నూలు హెడ్ ఆఫీస్‌కు (డీపీఎం యూకు) బదిలీ అయ్యారు.

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(సెంట్రల్) : నవంబర్ 1వ తేదీన జరిగే దీపావళి పండుగ కోసం టపాకాయల విక్రయాల కోసం ఆసక్తి ఉన్న వారు తాత్కాలికంగా లైసెన్స్‌లు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని కర్నూలు ఆర్‌డీఓ ఎం.శేషిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. అంతేకాక టపాసుల కొత్త లైసెన్స్‌లు, ఫారం–ఎల్ ఈ–5 లైసెన్స్ కోసం కర్నూలు రెవెన్యూ డివిజన్ పరిధిలోని సంబంధిత తహసీల్దార్ల ద్వారా వచ్చే 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఏకాగ్రతతో విలువిద్యను సాధన చేయండి

కర్నూలు (టౌన్) : విద్యార్థులు క్రమశిక్షణ, ఏకాగ్రతతో విలువిద్యను సాధన చేస్తే మంచి ఫలితాలు వస్తాయని ఎడిపై పాఠశాల ప్రిన్సిపాల్ జోసఫ్ డేవిడ్ స్పష్టం చేశారు. మంగళవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులకు ఉచిత ఆర్చరీ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఒలింపిక్ సంఘం గుర్తించిన ఈ క్రీడల్లో రాణిస్తే విద్యార్థినీ, విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు.

27 నుంచి అక్కినేని శతజయంతి వేడుకలు

కర్నూలు కల్చరల్ : టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు మూడు రోజుల పాటు నట సామ్రాట్, పద్మశ్రీ అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు. 27వ తేదీ నృత్య నీరాజనంతో వేడుకలు ప్రారంభిస్తామ ని తెలిపారు. 28వ తేదీ అక్కినేని సినిమాల్లో రికార్డు సృష్టించిన ప్రేమనగర్ సినిమాను ప్రదర్శిస్తున్నట్లు పేర్కొన్నారు. 29వ తేదీ వేడుకల ముగింపు సందర్భంగా సంగీతం, నృత్యం, నాటక విభాగాల్లో కృషి చేసిన కళాకారులను సన్మానిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆశాల సమస్యల పరిష్కారానికి కృషి

కర్నూలు(హాస్పిటల్): ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్. భాస్కర్ చెప్పారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆశా కార్యకర్తలకు ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్. భాస్కర్ మాట్లాడుతూ జిల్లాలో పని చేస్తున్న ఆశా కార్యకర్తల సమస్యల వినతి పత్రాలను స్వీకరించి, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చొరవ తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో డీఐవో డాక్టర్ నాగప్రసాద్ బాబు, ఏవో అరుణ, డీపీహెచ్ఎన్‌వో ఇందిర, డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

- వర్షాలతో దెబ్బతిన్న పైరు
- తగ్గిన దిగుబడులు... లభించని గిట్టుబాటు ధర
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు

కొర్ర రైతు కుదేలు!

సి.బెళగల్: అన్నదాతలను వర్షాభావ పరిస్థితులు, టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వెంటాడుతూనే ఉంది. ఏటేటా ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం తీసుకుని హుషారుగా సాగు చేసిన రైతులకు ఈయేడు నిరాశే ఎదురైంది. అప్పులుచేసి ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతన్నపై వరుణుడు సైతం కన్నెర్ర చేశాడు. దీంతో రైతులు అయోమయంలో పడ్డారు. ప్రత్యేకించి కొర్రరైతులు తీవ్రంగా నష్టపోయారు. వర్షాభావ పరిస్థితుల మూలంగా దిగుబడులు తగ్గడంతోపాటు ధర పూర్తిగా పడిపోవడంతో కొర్రరైతు కుదేలయ్యాడు. గతేడాది కొర్రలకు మంచి ధరలు ఉండటంతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అధిక మొత్తంలో మండల రైతులు సాగు చేశారు. సరైన గిట్టుబాటు ధరలు లేక రైతుల ఆందోళన చెందుతున్నారు. కొర్ర పంటలు కోతకు రావడంతో వారం రోజులుగా మండల రైతాంగం కోత పనులు చేపడుతున్నారు. అయితే గత 20 రోజుల క్రితం వరుసగా వారం రోజుల పాటు వర్షాలు కురవడంతో పంటల దిగుబడి తగ్గినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొర్ర ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం కల్పించే గిట్టుబాటు ధరలపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు.



కంబదహాల్ గ్రామ దారిలో కోతకు వచ్చిన కొర్ర పంట



సి.బెళగల్ శివారులో కొర్రపంటను కోస్తున్న యంత్రం

కొర్ర సాగు చేసిన సంవత్సరం	పంటసాగు విస్తీర్ణం ఎకరాలలో	దిగుబడి ఎకరాకు క్వింటాళ్లలో	ధర (క్వింటాంకు రూపాయలు)
2021	310	ఆరు నుంచి ఏడు క్వింటాళ్లు	రూ.3,800
2022	270	ఐదు నుంచి ఏడు క్వింటాళ్లు	రూ.4,600
2023	223	ఏడు నుంచి ఎనిమిది క్వింటాళ్లు	రూ.6,500
2024	903	ఐదు నుంచి ఆరు క్వింటాళ్లు	రూ.2,800 (దాదాపు)

580 ఎకరాలలో కొర్ర సాగు

గతేడాది మండల వ్యాప్తంగా కొర్ర పంటను 256 ఎకరాలలో పండించారు. దిగుబడులతోపాటు ధరలు అనుకూలించడంతో లాభపడ్డారు కొర్రరైతులు. దీంతో ఈ ఏడాది ఏకంగా 580 ఎకరాలలో కొర్ర పంటను సాగు చేశారు. గతేడాది కొర్రలు క్వింటాం రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు పలికింది. అయితే ప్రస్తుతం క్వింటాం కొర్రలు కేవలం రూ.3 వేలలోపే అమ్మకాలు జరుగుతున్నాయి. గత సంవత్సరం ఎకరాకు ఏడెనిమిది క్వింటాళ్లు దిగుబడి రాగా, ఇప్పుడు మాత్రం ఎకరాకు ఐదు నుంచి ఆరు క్వింటాళ్లు మాత్రమే దిగుబడులు వస్తున్నాయని రైతులు వాపోతున్నారు.

దిగుబడి భారీగా తగ్గింది



గతేడాది కొర్రకు మంచి ధరలు రావడంతో రైతులు లాభపడ్డారు. ఈ ఏడాది ఆశతో వానకాలం పంటలలో నేను రెండు ఎకరాలలో కొర్ర సాగు చేశా. మామూలుగా అయితే 16 క్వింటాళ్లు పండాలి. అయితే రెండు ఎకరాలకు కలిపి కేవలం తొమ్మిది క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. ఇప్పుడు ధరలకు ఈ దిగుబడి మరింత నష్టాన్ని కలిగించింది. ప్రభుత్వం న్యాయం చేయాలి.

– శేఖర్, కొర్ర రైతు, చింతమానుపల్లె గ్రామం

పండించిన పంటకు ధరలు లేకపోయే



ఈ సంవత్సరం చాలా మంది కొర్ర సాగు చేశాం. కొర్ర సాగు చేశాక వర్షాలు అధికంగా పడ్డాయి. దీంతో దిగుబడులు సైతం తగ్గాయి. దీనితోతోడు ఈ ఏడు పంట కొనుగోలు ధరలు పూర్తిగా పడిపోయాయి. ఇప్పటి వరకు పంటను అమ్ముకున్న రైతులు క్వింటాం కేవలం మూడువేల రూపాయలలోపు అమ్ముకున్నారు. పండించిన పంటలకు ధరలులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం కొర్ర రైతులను ఆదుకోవాలి.

– కురువ రవి, కొర్ర రైతు, పలుకుదొడ్డి గ్రామం

విస్తారంగా కొర్ర సాగు



కొన్నేళ్లుగా మండల రైతులు కొర్ర సాగుపై మక్కువ చూపుతున్నారు. గతేడాది కొర్ర సాగు చేసిన రైతులు బాగా లాభాలు గడించారు. దీంతో ఈయేడు ఖరీఫ్ సీజన్‌లో ఎక్కువ రైతులు కొర్ర సాగు చేశారు. అయితే వర్షాభావ పరిస్థితుల మూలంగా ఆశించినంత దిగుబడులు రాలేదు. ధరలు లేవని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయం వాస్తవమే.

– మల్లేష్‌కుమార్, సి.బెళగల్ ఏఓ

ఎంపీడీఓగా రఘునాథ్

కర్నూలు (రూరల్): కర్నూలు మండల ఎంపీడీఓగా జి.రఘునాథ్‌ను ఉన్నతాధికారులు నియమించారు. అనంతపురం జిల్లా నుంచి ఇక్కడికి బదిలీ అయిన రఘునాథ్‌రెడ్డి గతంలో ఈఓఆర్‌డీగా విధులు నిర్వర్తించారు.

గడివేముల ఎంపీడీఓగావాసుదేవ గుప్త

గడివేముల: గడివేముల మండల పరిషత్ అభివద్ధి అధికారిగా వాసుదేవ గుప్తను నియమిస్తూ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన ఎంపీడీఓల బదిలీల్లో భాగంగా గడివేముల ఎంపీడీఓగా పనిచేస్తున్న శ్రీనివాసరావును ప్యాపిలికి బదిలీ చేశారు.

ఓర్వకల్లు ఎంపీడీఓగా శ్రీనివాసులు

ఓర్వకల్లు: మండల నూతన ఎంపీడీఓగా శ్రీనివాసులను నియమిస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణ బదిలీలలో భాగంగా ఇంతవరకు ఇక్కడ పనిచేసిన ఎంపీడీఓ శివనాగప్రసాద్‌ను గూడూరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో డోన్ ఎంపీడీఓ శ్రీనివాసులును ఉన్నతాధికారులు నియమించారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

కర్నూలు (రూరల్) : కల్లూరు మండల పరిధిలోని లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫుట్‌బాట్ పోటీలకు ఎంపికయ్యారు. అండర్–14 విభాగంలో 8వ తరగతి విద్యార్థి పీటర్, అండర్–17 విభాగంలో 10వ తరగతి విద్యార్థి జాషువా ఎంపికయ్యారని ఫిజికల్ డైరెక్టర్ నాయకంటి గిడ్డయ్య తెలిపారు. బుధవారం పాఠశాల ఆవరణలో సభలో విద్యార్థులను హెచ్‌ఎం ఎస్ కృష్ణతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు. ఈనెల 28, 29, 30వ తేదీలలో పల్నాడు జిల్లా వినుకొండలో జరిగే పోటీల్లో విజయం సాధించాలని విద్యార్థులకు సూచించారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా



పెసరవాయిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ నాగార్జునరెడ్డి

గడివేముల: ప్రతిఒక్కరూ ప్రశాంత జీవనం అలవర్చుకోవాలని ఎస్ఐ నాగార్జునరెడ్డి సూచించారు. మండల పరిధిలోని ఫ్యాక్షన్ ప్రభావిత పల్లెలైన పెసరవాయి, మంచాలకట్ట, దుర్వేసి గ్రామాల్లో మంగళవారం ఎస్ఐ పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రజలతో ఎస్ఐ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంటుందని, ఐకమత్యంగా మెలుగుతూ గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. వ్యక్తిగత కక్షలకు వెళ్లి కుటుంబాలను నాశనం చేసుకోవద్దన్నారు. సమస్యలు తలెత్తినప్పుడు గ్రామపెద్దల సమక్షంలో సామరస్యంగా పరిష్కరించుకోవాలని, అప్పటికీ సంతృప్తి చెందకుంటే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, ఆధార్, బ్యాంక్ తదితర వ్యక్తిగత వివరాలు ఎవ్వరికీ ఇవ్వొద్దన్నారు. రౌడీ షీటర్ల కదలికలపై నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందని, నాటుసారా, గుట్కా, పేకాట తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రపంచ శాస్త్రవేత్తల జాబితాలో ఆర్జీఎం అధ్యాపకులు



శాస్త్రవేత్తలను అభినందిస్తున్న డాక్టర్ ఎం శాంతి రాముడు

పాణ్యం: అమెరికాలోని ప్రముఖ యూనివర్సిటీ స్టాన్ ఫోర్డ్ విడుదల చేసిన ప్రపంచ అత్యంత ప్రతిభా వంతుల శాస్త్రవేత్తల జాబితాలో ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన నలుగురు అధ్యాపకులు చోటు దక్కించుకున్నారు. ఈ మేరకు మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల డైరెక్టర్ అశోక్ కుమార్ మాట్లాడారు. మెకానికల్ ఇంజినీరింగ్ అండ్ ట్రాన్స్ పోర్ట్స్ విభాగంలో డాక్టర్ పి. సుదర్శన్ రెడ్డి 698 వ ర్యాంకు, డాక్టర్ పి. శ్రీదేవి 964 ర్యాంకు సాధించారన్నారు. అలాగే డాక్టర్ ఉపేంద్ర రజాక్ ఎనర్జీ విభాగంలో 1,169వ ర్యాంకు, డాక్టర్ బి జమాలయ్య అప్లైడ్ ఫిజిక్స్ విభాగంలో 5,794వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. వీరు ప్రచురించిన పలు సాంకేతిక అధ్యయనాలకు ఈ గుర్తింపు లభించిందని తెలిపారు. శాస్త్రవేత్తలను ఆర్జీఎం విద్యాసంస్థల అధినేత డాక్టర్ మిద్దె శాంతి రాముడు, ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్, డాక్టర్ అశోక్ కుమార్, డాక్టర్ రామిరెడ్డి అభినందించారు.

ఉల్చాల గ్రామానికి రాకపోకలు బంద్



వర్షపు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన బ్రిడ్జి

కర్నూలు (రూరల్) : మండల పరిధిలోని ఉల్చాల గ్రామం ప్రాంతాలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో ఉల్చాల గ్రామానికి వెళ్లే రోడ్డులోని బ్రిడ్జి కోతకు గురైంది. పూర్తిగా కొట్టుకపోవడంతో రాకపోకలు బంద్ అయ్యాయి. కర్నూలుకు వచ్చేందుకు విద్యార్థులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అతికష్టంగా కాలినడకను రావాల్సి వచ్చింది. వాహనచోదకులు చుట్టూ తిరిగి కర్నూలు చేరుకోవాల్సి వచ్చింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నూతనంగా బ్రిడ్జిని నిర్మించాలని గ్రామస్తులు కోరారు.

గిరిజన గురుకులాలపై దృష్టి సారించండి



ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న టీఎస్ఎఫ్ నాయకులు

కర్నూలు(అర్బన్): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గిరిజన గురుకులలు, ఆశ్రమ పాఠశాలలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం విజయవాడలోని ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ కార్యాలయం ఎదుట టీఎస్ఎఫ్ నేతలు శాంతియుతంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రాగిరి చంద్రప్ప, జాతీయ అధ్యక్షుడు అక్కులప్ప నాయక్ మాట్లాడుతూ హాస్టల్ కన్వర్టెడ్ గిరిజన గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని, ముఖ్యంగా ఆయా పాఠశాలల్లో పీజీటీ ఉపాధ్యాయులను నియమించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఏఎన్ఎం పోస్టులను భర్తీ చేయాలని, అలాగే గురుకులాల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ముఖ్యంగా గిరిజన సంక్షేమ శాఖకు రెగ్యులర్ ప్రిన్సిపల్ సెక్రెటరీని నియమించాలన్నారు. ప్రతి జిల్లాలో ఎస్టీ స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేయాలని, అన్ని ప్రభుత్వ శాఖల్లోని బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. అనంతరం గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ సదా భార్గవికి వినతి పత్రం అందించామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణునాయక్, ఉపాధ్యక్షులు రవీంద్రనాయక్, రామరాజు, వెంకటేష్, జాతీయ ప్రధాన కార్యదర్శి పల్లాల రాజకుమార్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్వర్లునాయక్, ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షులు జాన్‌వెస్లీ, నాయకులు మస్తాన్‌నాయక్, రంగరాజునాయక్, వెంకటేష్, సంతోష్, మల్లేష్‌నాయక్, వినోద్‌నాయక్ పాల్గొన్నారు.

శనగ విత్తనాలు సకాలంలో ఇప్పించండి



వ్యవసాయ కమిషనరేట్ జేడీఏ కృపాదాస్, జిల్లా వ్యవసాయాధికారిణి వరలక్ష్మికి సమస్యలు వివరిస్తున్న రైతులు

కోడుమూరు రూరల్ : వర్షాభావ పరిస్థితుల మూలంగా ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలు అంతంతమాత్రంగానే ఉన్నాయి.... కనీసం రబీ కింద పప్పు శనగ సాగు చేసుకునేందుకు విత్తనాలు సకాలంలో ఇప్పించాలని కోడుమూరు రైతులు వ్యవసాయ కమిషనరేట్ జేడీఏ కృపాదాస్, జిల్లా వ్యవసాయాధికారిణి వరలక్ష్మిని కోరారు. మంగళవారం సాయంత్రం కృపాదాస్, వరలక్ష్మి ఎమ్మిగనూరు నుంచి కర్నూలుకు వెళ్తూ కోడుమూరు వ్యవసాయ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు అధికారులకు సమస్యలు విన్నవించారు. వర్షాలు కురుస్తున్నందున నెలాఖరు నుంచి రబీకింద శనగ పంట సాగు చేస్తామని, ముందుగానే విత్తనాలిస్తే బాగుంటుందన్నారు. ఎకరాకు 25 కిలోల చొప్పున కాకుండా 40నుంచి 50కిలోల ప్రకారం ఇవ్వాలని వారు కోరారు. రైతులు కోరినట్లుగానే ముందుగానే శనగ విత్తనాలను అందజేయాలని జిల్లా వ్యవసాయాధికారులకు జేడీఏ కృపాదాస్ సూచించారు. కార్యక్రమంలో ఏడీఏలు ప్రవీణ్, ఖాద్రి, దస్తగిరిరెడ్డి, కోడుమూరు ఏఓ రవిప్రకాష్ పాల్గొన్నారు.

కేవీ సుబ్బారెడ్డి కళాశాలకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హోదా

కర్నూలు (రూరల్) : డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి కళాశాలకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హోదా వచ్చినట్లు కేవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఈ హోదాను గరుడ ఏరోస్పేస్, చెన్నై వారు ప్రకటించారన్నారు.

ఇన్‌ఫ్రాస్ట్రక్టర్ డెవలప్‌మెంట్ మెంబర్‌గా రామాంజనేయులు

కర్నూలు(రూరల్): కల్లూరు మండల టీడీపీ అధ్యక్షుడు డి.రామాంజనేయులు ఏపీ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ మెంబర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం ఎమ్మెల్యే గౌరుచరిత, గౌరు వెంకటరెడ్డిలను మర్యాద పూర్వకంగా కలసి సన్మానించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కర్నూలు (రూరల్) : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం డీఈఓ కార్యాలయం ఎదుట సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులు నిరసన తెలిపారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతి నెలా 1వ తేదీనే వేతనాలు చెల్లించాలని ఈ సందర్భంగా ఉద్యోగులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సమగ్ర శిక్ష జేఏసీ సెక్రెటరీ ఎం.చంద్రశేఖర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నూనె గింజల సాగుపై దృష్టి సారించండి



ఆముదం పైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఓర్వకల్లు: రైతులు నూనె గింజ పంటల సాగుపై దృష్టి మరల్చాలని హైదరాబాద్‌కు చెందిన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు గణేష్, శ్రీనివాస్‌లు సూచించారు. మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో సాగైన ఆముదం పంటను మంగళవారం వారు పరిశీలించారు. ఆముదం పంట సాగు మెలకువలను రైతులకు వివరించారు. అనంతరం సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రైతులు సాధారణ పంటలతో పాటు ఆముదం, కుసుమ, నువ్వులు, పొద్దు తిరుగుడు, వేరుశనగ పంటల సాగుపై మొగ్గు చూపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయ సాంకేతిక ఏఓ అల్లిపీర, ఏఈఓలు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

మినీ ట్రాలీని ఢీకొన్న బస్సు



డివైడర్ ఎక్కిన బస్సు



రోడ్డు పక్కకు వెళ్లిన మినీ ట్రాలీ

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద మంగళవారం మినీ ట్రాలీని తెలంగాణా ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. హైదరాబాద్ డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు నంద్యాలకు వెళ్తుంది. ముందు వెళ్తున్న మినిట్రాలీకి తమ్మరాజుపల్లె హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద కుక్క అడ్డురావడంతో డ్రైవర్ సడన్‌గా బ్రేక్ వేశాడు. అయితే వెనుక వస్తున్న బస్సు ట్రాలీని ఢీకొట్టి డివైడర్ ఎక్కింది. ఈ ఘటనలో బస్సు ముందు భాగం దెబ్బతింది. బస్సులో సుమారు 20మందికి పైగానే ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు.

మాజీ ఎమ్మెల్యే కాటసాని ఆరా

తమ్మరాజుపల్లె వద్ద జరిగిన ప్రమాదంపై పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆరా తీశారు. కర్నూలు నుంచి నంద్యాలకు వెళ్తున్న కాటసాని తమ్మరాజుపల్లె వద్ద ప్రమాదానికి గురైన బస్సు వద్ద వాహనాన్ని ఆపారు. పోలీసులు, ఆర్టీసీ సిబ్బందితో ప్రమాదంపై ఆరా తీశారు.

వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ మల్లేష్‌కుమార్



రైతులతో మాట్లాడుతున్న ఏఓ రవిప్రకాష్



రైతులకు సూచనలిస్తున్న ఏఓ సుధాకర్

సి.బెళగల్: వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను పాటించి అధిక దిగుబడులను పొందాలని ఏఓ మల్లేష్‌కుమార్ రైతులకు సూచించారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం సి. బెళగల్ రైతు సేవా కేంద్రం – 2లో సర్పంచ్ పాండురంగన్న అధ్యక్షతన ఏఓ సమావేశం నిర్వహించారు. అదేవిధంగా చింతమానుపల్లె గ్రామ సచివాలయంలో రైతులతో ఏఓ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏఓ ఆధునిక వ్యవసాయం, వ్యవసాయ యాంత్రీకరణ పద్ధతులను రైతులకు వివరించారు. అనంతరం ఆయా గ్రామాల్లో సాగైన పొలాలను పరిశీలించారు. సాగు మెలకువలు, పైరు సంరక్షణ సూచనలు చేశారు. కార్యక్రమంలో స్థానిక పశు వైద్యుడు ప్రవీన్ కుమార్, ఏఈఓ సిద్ధు, ఎంఈపీఈఓ వెంకటేష్, వీఏఏ ఆసీఫ్, ప్రవీన్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించాలి

కోడుమూరు రూరల్: సాగులో తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించాలని ఏఓ రవిప్రకాష్ సూచించారు. కోడుమూరులో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని ఏఓ నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తి, కంది పంటల సాగులో పాటించాల్సిన మెలకువలు, చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు ఏఓ సూచించారు. ఎంఐ ఏఓ సుధారాణి బోరు బావులున్న రైతులు ముందుకొస్తే బిందు సేద్యానికి అవసరమైన పరికరాలను సబ్సిడీపై అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది రసూల్, జయంత్, విజయశాంతి తదితరులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండల పరిధిలోని హుసేనాపురం, ఉయ్యాలవాడ గ్రామాలలో మంగళవారం ఏఓ సుధాకర్ 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించారు. పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణ, కందిలో మరకమచ్చల పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ సందర్భంగా రైతులకు ఏఓ సూచించారు. గూర్చి వివరించారు. కార్యక్రమంలో హుసేనాపురం సర్పంచ్ చంద్ర గోవర్ధనమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు చిన్నమ్మ, ఏఈఓలు భాస్కర్, మధు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు (రూరల్) : కల్లూరు మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన డీపీడీ శ్రీలత, డాట్ సెంటర్ శాస్త్రవేత్తలు సుజాత పంటల సాగు మెలకువలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఓ శ్రీనివాసరెడ్డి, పశువుల డాక్టర్ రాజారెడ్డి, రైతులు పాల్గొన్నారు.